

# సి.ఐ.డి

ముద్దా విశ్వనాథం

"వెయ్ వెయ్, దుడ్డు తిరగెయ్! దెబ్బతో దిమ్మతిరిగి పడాలి!" హుషారిచ్చాడు యజమాని.

పదిమంది పరుగులెత్తారు, కాపాటి కర్రలుచ్చుకుని. చెప్పలేనంత హంగామా హడావిడీ చేశారు. ఇంతకూ ఆ ఎలక అంతమందినీ చిత్తుచేసి కలుగులోకి దూరేపోయింది.

తీవ్రమయిన యోచనలో పడ్డాడు మానవుడు. చుట్ట కాలుస్తూ పొగలు వదుల్తున్నాడు.

"నాలుగు బస్తాల ధాన్యం నలుసులోకి లేకండా పొల్లుచేసి పారేశాయి, బంగారం లాంటి ధాన్యం. ఈరోజుల్లో ఎంత నష్టం, ఎంత నష్టం! రాత్రికి రాత్రి ఎంత మన్ను తోడిపోశాయో. వీటి దుంపతెగా! ఇరవై మంది కూలీల పని ఒక్క పందికొక్కు చేసేస్తుంది, ఎంత సత్తువోగాని. ఏవిఁటి దారి, వీటిని జయించడం బ్రహ్మతరం కూడా కానట్టుందే!"

* * *

"ఎవరు ఎవర్ని జయించడం?" ఒక శబ్దం వినిపించింది. కన్నంలోంచి ఒక ఎలక వచ్చి తలెత్తి చూసింది. ఉగ్రుడై వున్న మానవుడు తెల్లబోయాడు. ఉక్రోషం పట్టలేక పిడికిలి బిగించాడు–

"చూస్కో ఏంచేస్తానో. మూషిక యాగంచేసి మీ జాతిని కలికంలోకి కనబడకుండా చేసేస్తా, తెలుసుకో!"

"మూషికం – దొంగ – అని పేర్లెడుతున్నావే మాకు, నువ్వేదో మహా పెద్ద మనిషివైనట్టూ? తెలుసు నాకు, మీ మానవులు చేసే యాగాలు! నీకు మిత్రులెవరున్నారు ఈ లోకంలో? అంతా శత్రువులే, వైరి వర్గం. ఎన్ని యాగాలు చేసి ఎంతమందిని జయిస్తావ్? ఈగలు, దోమలు, బొద్దెంకలు, చెదపురుగులు, పంట మిడతలు – ఒకటేమిటి, అంతా శత్రుకోటే నీకు. వాటి సంహారంకోసం కార్ఖానాలు నిర్మించి, రోజు రోజూ యాగాలు చేస్తూనే ఉన్నావుగా? అందరూ చచ్చిపోవాలి, నువ్వొక్కడవే ఈ భూలోకంలో ఉట్టికట్టుకు ఊరేగాలి. అవునా?"–

తమాయించాడు మానవుడు.

"బాగా చెప్పావులే. రాత్రీ పగలూ వేధించుకు తినే ఈ పీడల్ని మారణం చెయ్యక ఎట్లా వదిలించుకోవడం?"

"ఎట్లాగా?–యాగం చెయ్యడమే పని, నువ్వన్నట్టు. చెయ్ చెయ్. మూషిక యాగంకోసం బోన్లు పెట్టించావ్. డిఫెన్సు ఫోర్స్ పిల్లుల పటాలాల్ని పెంచి పోషిస్తున్నావ్..."

"మీ జాతిలో నువ్వేదో కాస్త తెలివిగా కనిపిస్తున్నావే, కనుకనే మాటాడ బుద్ధేస్తూంది."

"నీకూ హృదయ మున్నట్టుందే, కనుకనే జవాబు చెప్పబుద్ధేస్తూంది."

"అయితే న్యాయం చెప్పు. మానవుడు కష్టించి సంపాదించుకున్నది తేరగా కూచుని కాజెయ్యడం, మీ కిదేమన్నా బాగుందా?"

"నిజం నిజం. నువ్వన్నది అక్షరాలా నిజం. కానీ... ఒక చిన్న ధర్మసూక్ష్మం తెలుసుకోలేకపోయావే మానవుడా! నే చెబుతా విను!

"ఈ మహాసృష్టి రెండు భాగాలు. వన్యమృగాలూ అవీ సహజసిద్ధంగానే అరణ్యవాసం చేస్తూ, వాటి గొడవ అవి చూసుకుంటున్నాయి. రెండో భాగం మనం. అంటే మనందరం అన్నమాట– ఒకే కుటుంబానికి చెందినవాళ్ళం.

"బుద్ధీ జ్ఞానం గల మానవుడు ఎప్పుడయితే తన సుఖ సంతోషాలకోసం ఏర్పాట్లు చేసుకున్నాడో, తనని ఆశ్రయించుకున్న జీవకోటిని కూడా సమానంగా పోషించే బాధ్యత ఉండనే ఉన్నది. నువ్వెప్పుడైతే ఇల్లు కట్టుకున్నావో ఆ క్షణమందే పిల్లులూ, బల్లులూ మంచంకోళ్ళు నాశ్రయించుకుని నల్లులూ అవీ అవతరిస్తున్నాయి. అన్నీ




మానవుడి ఆస్తికి వారసులు. కనుక వాటి వంతు వాటికిస్తూ, నువ్వు మర్యాదగా మనుగడ సాగించాలి. అంతేగాని-వాటిని నువ్వు ఇంటిశత్రువులుగా చూస్తే, అవీ నిన్ను అలానేచూస్తాయి. నీవిధి నువు నెర వేర్చుకో. తోటి జీవకోటిని కూడదీసుకుని హాయిగా బతుకు!"

ఓరిమిలేని మానవుడికి మళ్ళీ క్రోధం ఉబికింది. "పెద్ద కబుర్లు చెప్పి వేదాంతం బోధిస్తూందే! పట్టూ-బోనులో పెట్టూ-దొంగముండా ఎలక - నా కంటికగపడ నివ్వకు-దీన్ని దయతలచకూడదు..."

వెంటనే సేవకులు దాన్ని పట్టి బోనులో బంధించారు. ఇహ మరి కన బడనివ్వ కూడదని చెప్పాడుగా యజ మాని? రెండుమైళ్ళ దూరం తీసుక పోయి పొలాల్లో వదిలేశారు.

* * *

మూడో రోజుకల్లా మరో నాలుగు బస్తాల ధాన్యం పొల్లయిపోయింది. మండుకొచ్చింది మానవుడికి. విచారంలో పడ్డాడు. "ఈ వెధవ ఎలకని జయిం చడం నావల్ల...''

"ఎవరు ఎవర్ని జయించడం?" మునపటిలాగానే శబ్దం వినిపించింది. కన్నంలోంచి ఒక ఎలక వచ్చి తల ఎత్తి చూసింది.

"అదుగో, అదుగో! దాన్ని మారణ హోమం చేస్తే మళ్ళా ఇంకోటి దాపరిం చిందే! వెయ్ వెయ్, దుడ్డు, తిరగెయ్! దెబ్బతో దిమ్మతిరిగి పడాలె!"

"ఇంకోటి కాదు, నేనే, నేనే. నువ్వను కున్నట్టు మూషిక యాగం చెయ్యటం సాధ్యంకాదు సుమా! మానవ జాతి ఉన్నంతకాలమూ మూషికజాతి ఉండే తీరుతుంది. మానవుడు మమ్నల్ని జయించలేడు. ఈ మాట చెప్పడానికే వచ్చా."

"నాలుగు బస్తాలగింజలు పోయేసరికే గిజగిజ కొట్టుకుపొయ్యావే, మాకు దొంగలనీ, మూషికాలనీ పేర్లు పెట్టావే, యాగం చేస్తానంటివే? నువు పాతాళంలో ఎన్ని వందల బస్తాలు దాచిపెట్టావో, ఎన్ని లక్షల ఇళ్ళు గుల్లచేస్తున్నావో మాకా తెలీదు? మానవుణ్ని మించిన పెద్ద పందికొక్కు మరెక్కడయినా ఉందా?

"నీ గుట్టూ, మర్యాదా కాపాడేది మేము. నువు దాచిన పంటకు రక్షకులం. మా వంతు మేం అనుభవిస్తే ఎందు కేడు స్తావ్? పిచ్చి వేషాలు వెయ్యక నీ విధి తెలుసుకు మసులుకో. మళ్ళా కలుద్దాం, వస్తా!-''

"వేలంత ఉన్నావో లేదో, కమ్యూ నిజమ్ బోధిస్తున్నావే, నాకు?"

"కమ్యూనిజమో, సోషలిజమో నాకు తెలవదు. కాని మూషికరాజు చేతిలో మానవుడికి డిఫీటిజం మట్టుకు తథ్యం!'' -అంటూ గిరుక్కున తిరిగి ఎలక మళ్లీ కలుగులోకి దూరిపోయింది.

అశక్తుడైన మానవుడు సిగ్గుతో తల వంచాడు!!-